మల్కాజిగిరి ఎంపీగా రేవంత్‌రెడ్డి చేసిన అభివృద్ధి శూన్యం



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

కుత్బుల్లాపూర్: బీజేపీ, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు రాజకీయ లబ్ధి కోసమే పోటీ చేస్తున్నారని... ప్రజా సంక్షేమం కోసం బీఆర్ఎస్ పార్టీని ఆదరించాలని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. సుభాష్‌నగర్, సూరారం డివిజన్లలోని పలు ప్రాంతాల్లో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వివేకానంద్ మాట్లాడుతూ... మల్కాజిగిరి ఎంపీగా గెలిచిన రేవంత్ రెడ్డి ఇక్కడ చేసిన అభివృద్ధి శూన్యమని విమర్శించారు. ప్రస్తుతం బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు మోసపూరిత వాగ్దానాలు చేస్తున్నాయని ఆరోపించారు. గత 25 ఏళ్లుగా ప్రజాక్షేత్రంలో ఉంటూ ఎన్నో సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తున్న బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు హేమలత, మంత్రి సత్యనారాయణ, నేతలు పుప్పాల భాస్కర్, పోలే శ్రీకాంత్, యాదగిరి, వెంకటస్వామి, ప్రభాకర్, గుబ్బల లక్ష్మీనారాయణ, శ్రీనివాస్‌రెడ్డి, సదానందం తదితరులు పాల్గొన్నారు.

నేటి కేటీఆర్ రోడ్ షోను విజయవంతం చేయాలి..

◆ ఈనెల 4వ తేదీన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నిర్వహించనున్న రోడ్ షోను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే వివేకానంద్ కోరారు. గాజులరామారం డివిజన్ యం డమూరి ఎన్‌క్లేవ్‌లో డివిజన్ అధ్యక్షుడు విజయరామ్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన సన్నాహక సమావేశానికి వివేకానంద్ హాజరై దిశానిర్దేశం చేశారు. ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డికి మద్దతుగా నిర్వహిస్తున్న కేటీఆర్ రోడ్‌షోకు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీ ఎత్తున తరలిరావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కస్తూరి బాల్‌రాజ్, కమలాకర్, శ్రీనివాస్‌యాదవ్, సంధ్యారెడ్డి, నవాబ్, తారాసింగ్ తదితరులు పాల్గొన్నారు.

పురుషులే కీలకం



మల్కాజిగిరి లోక్‌సభ నియోజకవర్గంలో అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా పురుషులు, మహిళా ఓటర్ల వివరాలు

అసెంబ్లీ సెగ్మెంట్	పురుషులు	మహిళలు
మేడ్చల్	3,40,218	3,25,703
మల్కాజిగిరి	2,55,325	2,52,712
కుత్బుల్లాపూర్	3,78,362	3,46,468
కూకట్‌పల్లి	2,51,424	2,30,506
ఉప్పల్	2,79,495	2,60,516
కంటోన్మెంట్	1,26,699	1,26,997
ఎల్బీనగర్	3,14,101	2,90,528
మొత్తం	19,45,624	18,33,430

- మల్కాజిగిరి లోక్‌సభలో మొత్తం ఓటర్లు 37.79లక్షలు
- పురుష ఓటర్లు 19.45లక్షల మంది
- మహిళ ఓటర్లు 18.33 లక్షల మంది

సాక్షి,మేడ్చల్ జిల్లా: దేశంలోనే అతి పెద్ద పార్లమెంట్ నియోజకవర్గమైన మల్కాజిగిరిలో అభ్యర్థుల గెలుపోటములకు పురుషుల ఓట్లే కీలకం కానున్నాయి. మల్కాజిగిరి లోక్‌సభ నియోజకవర్గం పరిధిలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లలో మొత్తం ఓటర్లు 37,79,596 మంది ఉన్నారు. ఇందులో పురుష ఓటర్లు 19,45,624మంది కాగా, మహిళా ఓటర్లు 18,33,430 మంది ఉన్నారు. నియోజకవర్గంలో మహిళా ఓట్ల కంటే పురుషుల ఓట్లు 1,12,194 అధికంగా ఉన్నాయి. ప్రస్తుతం ఉప ఎన్నికలు జరుగుతున్న కంటోన్మెంట్ అసెంబ్లీ నియోజకవర్గం మినహాయించి మిగతా మేడ్చల్, మల్కాజిగిరి, కుత్బుల్లాపూర్,

◆ కూకట్‌పల్లి, ఉప్పల్, ఎల్బీనగర్ అసెంబ్లీ నియోజకవర్గాల్లో మహిళా ఓటర్ల కంటే పురుష ఓటర్లే అధికంగా నమోదై ఉన్నారు. కంటోన్మెంట్ అసెంబ్లీ నియోజకవర్గంలో పురుష ఓటర్లు1,26,699 మంది ఉండగా, మహిళా ఓటర్లు 1,26,997 మంది ఉన్నారు. ఇక్కడ మాత్రం పురుష ఓటర్ల కంటే మహిళా ఓటర్లు 328 మంది మాత్రమే ఎక్కువగా ఉన్నారు.

◆ **రెండు నెలల్లో పెరిగిన ఓటర్లు 51,077 మంది**

ఎన్నికల సంఘం ఫిబ్రవరి 8న తుది ఎన్నికల జాబితా ప్రకటించింది. ఈ ఎన్నికల ఓటర్ల తుది జాబితా ప్రకారం మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లలలో మొత్తం ఓటర్ల సంఖ్య 37,28,519 కాగా, ఏప్రిల్ 25న ఎన్నికల సంఘం ప్రకటించిన ఓటర్ల తుది జాబితా ప్రకారం ఓటర్ల సంఖ్య37,79,596 ఉంది. ఈ ఓటర్ల జాబితాను అనుసరించి దాదాపు రెండు నెలల వ్యవధిలోనే మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో 51,077 మంది ఓటర్లు పెరిగారు.

పట్టుదలతో చదివితే విజయం తథ్యం



విద్యార్థి ఉమామహేశ్వర్‌ను అభినందిస్తున్న ఫాదర్స్ మోడల్ హైస్కూల్ కరస్పాండెంట్ పద్మ

కుత్బుల్లాపూర్: పట్టుదలతో చదివిన విద్యార్థులు తప్పకుండా విజయం సాధిస్తారని గాజులరామారం ఫాదర్స్ మోడల్ హైస్కూల్ కరస్పాండెంట్ పద్మ పేర్కొంది. ఇటీవల ప్రకటించిన పదో తరగతి ఫలితాల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించడంతో శుక్రవారం విద్యార్థులతో సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. 10/10 జీపీఏ సాధించిన ఉమామహేశ్వర్‌తో పాటు వివిధ కేటగిరీలో ప్రతిభ చూపిన వారిని సన్మానించారు. ఈ సందర్భంగా పద్మ మాట్లాడుతూ.. స్కూల్లో చదువుకునే ప్రతి విద్యార్థికి క్రమశిక్షణతో పాటు చదువు ప్రాధాన్యత వివరిస్తూ ముందుకు సాగామన్నారు. గత నాలుగేళ్లుగా స్కూల్ నుంచి అనేక మంది విద్యార్థులు వివిధ కళాశాలలో ప్రతిభ చూపుతున్నారని గుర్తు చేశారు. ప్రస్తుతం అడ్మిషన్ల ప్రారంభమైందని పేర్కొన్నారు.

లౌకిక ప్రభుత్వ ఏర్పాటుకు తోడ్పాటునందించండి

సీపీఎం మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కార్యదర్శి పి.సత్యం

సాక్షి,మేడ్చల్ జిల్లా : దేశాన్ని తిరోగమనంలోకి తీసుకెళ్తున్న బీజేపీని ఓడించటంతోపాటు కేంద్రంలో ప్రత్యామ్నాయ లౌకిక ప్రభుత్వ ఏర్పాటుకు తోడ్పాటు అందించాలని సీపీఎం మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కార్యదర్శి పి.సత్యం ప్రజలకు పిలుపునిచ్చారు. శుక్రవారం నగరంలోని సీపీఎం జిల్లా కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మట్లాడారు. రాజ్యాంగ సంస్థలను బీజేపీ ప్రభుత్వం దుర్వినియోగం చేస్తుందన్నారు. రాజకీయ లబ్ధి కోసం ప్రతిపక్షాలపై దాడులు చేయటంతోపాటు లొంగని వారిపై ఈడీ, సీబీఐ కేసులు పెడుతోందన్నారు. ఈ నెల 5 నుంచి జిల్లాలోని అసెంబ్లీ నియోజకవర్గాల్లో బైక్ ర్యాలీలు, పబ్లిక్ మీటింగ్‌లు, డోర్ టూ డోర్ ఎన్నికల క్యాంపెయిన్ నిర్వహిస్తామన్నారు. సమావేశంలో మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గం పార్టీ ఇన్‌చార్జ్,సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కోమటి రవి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఐఎన్‌టీయూసీ వ్యవస్థాపక దినోత్సవం



కేక్ కట్ చేస్తున్న కార్మిక నేత చింతల నాగరాజు

కుత్బుల్లాపూర్: భారతదేశ స్వాతంత్ర్యం అనంతరం కేంద్రంలో కార్మిక చట్టాలు, కనీస వేతనాలు, సామాజిక, కార్మికుల భద్రత కల్పనలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య భూమిక పోషించిందని రాష్ట్ర కార్మిక నాయకుడు చింతల నాగరాజు అన్నారు. ఐఎన్‌టీయూసీ 77వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా చింతల్‌లో శుక్రవారం వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం చింతల నాగరాజు మాట్లాడుతూ... కార్మికుల హక్కుల సాధన కోసమే ఐఎన్‌టీయూసీ ఏర్పడిందన్నారు. కార్మికులకు ఎలాంటి అన్యాయం జరిగినా తాము అండగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో దేవా, ఆనంద్, సాయి, చిన్న తదితరులు పాల్గొన్నారు.

భారతి సిమెంట్ అల్ట్రాఫాస్ట్‌తో నిర్మాణ ప్రక్రియ వేగవంతం



మేస్త్రీలకు భారతి అల్ట్రాఫాస్ట్ సిమెంట్ బ్రాండ్‌ను అందజేస్తున్న ఇంజినీర్లు నరసింహులు, సాహెర్

కుత్బుల్లాపూర్: సిమెంట్ వ్యాపారంలో తిరుగులేని సంస్థగా ఎదుగుతున్న భారతి సిమెంట్ అల్ట్రాఫాస్ట్ పేరుతో ఫాస్ట్ సెట్టింగ్ సిమెంట్ 5స్టార్ గ్రేడ్ తెలంగాణలో విడుదల చేసిందని ఆ సంస్థ టెక్నికల్ ఇంజినీర్లు నరసింహులు, సాహెర్ అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం సూరారంలో శుక్రవారం రాయల్ ట్రేడర్స్ డీలర్ దుకాణంలో 50మంది తాపీ మేస్త్రీలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... మార్కెట్‌లో లభించే ఇతర సిమెంట్ బ్రాండ్‌లతో పోలిస్తే భారతి అల్ట్రాఫాస్ట్‌తో నిర్మాణ ప్రక్రియ చాలా వేగవంతంగా పూర్తవుతుందన్నారు. అల్ట్రాఫాస్ట్ సిమెంట్ ముఖ్యంగా స్లాబులు, పిల్లర్లు, బ్రిడ్జిలు, రహదారులకు సరైన ఎంపిక అని పేర్కొన్నారు. అల్ట్రాఫాస్ట్ వినియోగదారులకు ఉచిత సాంకేతిక సహాయం అందజేస్తామన్నారు. స్లాబ్ కాంక్రీట్ వేసే సమయంలో నిపుణులైన భారతి సిమెంట్ ఇంజినీర్లు సైట్ వద్దకే వచ్చి సహాయపడవుతారని పేర్కొన్నారు. మార్కెట్లో లభించే ఇతర సిమెంట్లతో పోలిస్తే భారతి అల్ట్రాఫాస్ట్ రూ.20 అధికంగా ఉంటుందని తెలపారు. డీలర్ సంగమేష్ మాట్లాడుతూ.. భారతి సిమెంట్ సర్వీస్ చాలా ఫాస్ట్‌గా ఉంటుందన్నారు.

నేడు జీడిమెట్ల డివిజన్‌లో ఈటల రాజేందర్ ప్రచారం

కుత్బుల్లాపూర్: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో శనివారం జీడిమెట్ల డివిజన్ పరిధిలో మల్కాజ్‌గిరి బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ ఇంటింటి ప్రచారం చేపట్టనున్నారని అర్బన్ జిల్లా కార్యదర్శి భరతసింహారెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 6.30 గంటల నుంచి ప్రారంభమయ్యే ప్రచార కార్యక్రమంలో కార్యకర్తలు, నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

నేడు షాపూర్‌నగర్ చౌరస్తాలో కేటీఆర్ రోడ్ షో

కుత్బుల్లాపూర్: బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ శనివారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారంలో పాల్గొననున్నారు. మల్కాజ్‌గిరి లోక్‌సభ బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డికి మద్దతుగా సాయంత్రం 5గంటలకు షాపూర్‌నగర్ చౌరస్తాలో సాగర్ హోటల్ వద్ద రోడ్‌షో నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులు, సంక్షేమ సంఘాల నాయకులు, అభిమానులు పెద్ద ఎత్తున తరలిరావాలని ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు, ఎమ్మెల్యే వివేకానంద్ ఓ ప్రకటనలో కోరారు.

రూ.50 లక్షల నగదు స్వాధీనం

శామీర్‌పేట్: శామీర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలోని తూంకుంటలో ఎస్‌ఓటీ పోలీసులు భారీగా నగదును స్వాధీనం చేసుకున్నారు. ఏటీఎం డిపాజిట్ చేసే సంస్థకు చెందిన వాహనంలో క్యూ ఆర్ కోడ్ లేకపోవడంతో పాటు ఎన్నికల సంఘం నిబంధనలు పాటించకుండా రూ. 50 లక్షల నగదును తరలిస్తున్నారన్న సమాచారంతో మేడ్చల్ ఎస్ఓటీ దాడులు నిర్వహించారు. నగదుతో పాటు వాహనాన్ని సీజ్ చేసి, శామీర్‌పేట పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నిర్మాణ వ్యర్థాల డంపింగ్‌కు అడ్డుకట్టేది?



వెంకట్రామిరెడ్డినగర్‌ను ఆనుకుని హెచ్‌ఎంటీ స్థలంలో డంప్ చేసిన డెబ్రిస్



పంచశీలకాలనీని ఆనుకుని ఐడీపీఎల్ స్థలంలో గుట్టలుగా పోసిన భవన నిర్మాణ వ్యర్థాలు

రంగారెడ్డినగర్: ఖాళీ ప్రదేశాల్లో భవన నిర్మాణ వ్యర్థాల డంపింగ్‌కు అడ్డుకట్ట పడటం లేదు. కుత్బుల్లాపూర్, గాజులరామారం జంట సర్కిళ్ల వ్యాప్తంగా భవన నిర్మాణ వ్యర్థాలను డంప్ చేయడానికి అధికారులు పలు 'డంపింగ్ పాయింట్'లను ఏర్పాటు చేశారు. అయితే సదరు పాయింట్లలో డంప్ చేస్తే డబ్బు చెల్లించాల్సి ఉండటంతో కొందరు భవన వ్యర్థాలను గుట్టు చప్పుడు కాకుండా ఖాళీ ప్రదేశాల్లో వేసి చేతులు దులుపుకుంటున్నారు.

◆ రంగారెడ్డినగర్ డివిజన్ పరిధిలో హెచ్‌ఎంటీ, ఐడీపీఎల్ ఖాళీ స్థలాలు ఎక్కువగా ఉండటంతో అక్రమ డంపింగ్‌కు కేంద్రంగా మారాయి. వెంకట్రామిరెడ్డినగర్‌ను ఆనుకుని ఉన్న హెచ్‌ఎంటీ స్థలంలో, పంచశీల కాలనీని ఆనుకుని ఉన్న ఐడీపీఎల్ స్థలంలో రాత్రి వేళల్లో డంపింగ్ వ్యవహారం జోరుగా కొనసాగుతోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు దీనిపై దృష్టి సారించి భవన వ్యర్థాల డంపింగ్‌కు అడ్డుకట్ట వేయాలని స్థానికులు కోరుతున్నారు.

నీటి ఎద్దడి నివారణకు జలమండలి ప్రత్యేక ఏర్పాట్లు



షాపూర్‌నగర్ రిజర్వాయర్ వద్ద ఏర్పాటు చేసిన నూతన ఫిల్లింగ్ స్టేషన్‌లో ట్యాంకర్‌ను నింపుతూ..

చింతల్: కుత్బుల్లాపూర్‌లో నీటి ఎద్దడి నివారణకు జలమండలి అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. కుత్బుల్లాపూర్ జలమండలి పరిధిలోని జీడిమెట్ల సెక్షన్‌లో ఉన్న ఫిల్లింగ్ పాయింట్ నుంచి వాటర్ ట్యాంకర్లు ఇతర ప్రాంతాలకు వెళ్లేందుకు దురభారంగా ఉండటంతో జల మండలం అధికారులు నూతన ఫిల్లింగ్ పాయింట్లను ఏర్పాటు చేశారు. కుత్బుల్లాపూర్ పరిధిలోని అన్ని బస్తీలు, కాలనీలకు గతంలో జీడిమెట్ల సెక్షన్ పరిధిలో వాణి కెమికల్, వసంత కెమికల్ సమీపంలో ఉన్న వాటర్ ఫిల్లింగ్ పాయింట్ల నుంచి ట్యాంకర్లను పంపేవారు. అయితే అక్కడి నుంచి గాజులరామారం, చింతల్, సుచిత్ర తదితర ప్రాంతాలకు ట్యాంకర్లను పంపడంతో సమయం ఎక్కువగా పట్టేది.

◆ దీంతో గాజులరామారం తదితర ప్రాంతాలకు దగ్గరగా ఉండేందుకని షాపూర్‌నగర్‌లోని రిజర్వాయర్ వద్ద నూతన ఫీలింగ్ పాయింట్లను ఏర్పాటు చేశారు. దీని ద్వారా గాజులరామారం సమీపంలో ఉన్న పలు బస్తీలకు, కాలనీలకు ట్యాంకర్లను వెంటవెంటనే పంపేందుకు వెసులుబాటు కలిగిందని జలమండలి అధికారులు పేర్కొంటున్నారు.

◆ జీడిమెట్ల రిజర్వాయర్‌కు వెళ్లి రావడానికి ఒక్కో ట్యాంకర్‌కు అరగంట సమయం పైగా పడుతుండటంతో షాపూర్‌నగర్ నుంచి పంపడం వల్ల ఎక్కువ ట్రిప్పులు పంపే వెసులుబాటు కలిగిందన్నారు. షాపూర్‌నగర్ ఫిల్లింగ్ పాయింట్ ద్వారా ప్రతిరోజు సుమారు 60 నుంచి 80 ట్యాంకర్లను పంపుతున్నామని అన్నారు. ఈ ట్యాంకర్లు ఏరోజుకారోజు బుకింగ్ అయిన వెంటనే పంపుతున్నట్లు జలమండలి సీజీఎం, కుత్బుల్లాపూర్ జీఎం శ్రీధర్‌రెడ్డి 'సాక్షి'కి తెలిపారు.

బీజేపీ గెలిస్తే రాజ్యాంగానికే ప్రమాదం

సీపీఐ రాష్ట్ర నేత ఎన్. బాలమల్లేష్

సాక్షి, మేడ్చల్ జిల్లా: దేశంలో బీజేపీ మళ్ళీ గెలిస్తే రాజ్యాంగానికి పెను ప్రమాదం పొంచి ఉంటుందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఎన్. బాలమల్లేష్ విమర్శించారు. అందుకే ఈ ఎన్నికల్లో బీజేపీని గద్దె దింపటమే తక్షణ కర్తవ్యంగా సీపీఐ కార్యకర్తలు పని చేయాలని కోరారు. శుక్రవారం నగరంలోని సీపీఐ జిల్లా కేంద్ర కార్యాలయంలో దామోదర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన జిల్లా కౌన్సిల్ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా మట్లాడుతూ రాజ్యాంగం మార్పు కోసమే మెజారిటీ సీట్లు అడుగుతున్నామని బీజేపీ అంటుందని పేర్కొన్నారు. ఈడీ, ఐటీ, ఎన్ఐఏ,సీబీపీ వంటి సంస్థలను బీజేపీ రాజకీయ సాధనాలుగా వాడుకుంటున్నదని విమర్శించారు. ఓట్ల కోసం రాజ్యాంగమంటే గౌరవమని పేర్కొంటున్న బీజేపీ మూడోసారి అధికారంలోకి వస్తే పూర్తిగా తొలగిస్తుందని పేర్కొన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ఇండియా కూటమికి చెందిన కాంగ్రెస్ అభ్యర్థి పట్నం సునీత మహేందర్‌రెడ్డి గెలిపించాలన్నారు. సమావేశంలో జిల్లా సీపీఐ కార్యదర్శి డీజీ సాయిలుగౌడ్, సీపీఐ నేతలు దామోదర్ రెడ్డి, ఉమామహేష్, కృష్ణమూర్తి, దశరథ్ పాల్గొన్నారు.

మైక్రో అబ్జర్వర్ల కేటాయింపు

సాక్షి,మేడ్చల్ జిల్లా: మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గం ఎన్నికల నిర్వహణలో భాగంగా మైక్రో అబ్జర్వర్లను ఆన్‌లైన్ ద్వారా జనరల్ పరిశీలకులు డాక్టర్ ప్రియాంక శుక్లా రెండో రాండమైజేషన్ ద్వారా కేటాయించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా ఎన్నికల అధికారి గౌతమ్ సమక్షంలో రాండమైజేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. వీరందరికి ఈనెల 7న కూకట్‌పల్లి జేఎన్‌టీయూలో శిక్షణ ఉంటుందని జిల్లా సాధారణ పరిశీలకులు డాక్టర్ ప్రియాంక శుక్లా తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, డీఆర్ఓ హరిప్రియ, డీఈఓ విజయకుమారి పాల్గొన్నారు.

ఈవీఎం, కంట్రోల్ యూనిట్ల ర్యాండమైజేషన్ పూర్తి

సాక్షి, మేడ్చల్ జిల్లా: పార్టీల ప్రతినిధుల సమక్షంలో రెండోదశ ఈవీఎం, బ్యాలెట్, కంట్రోల్ యూనిట్లు, వీవీ ప్యాట్ల ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి చేసినట్లు మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గం సాధారణ పరిశీలకులు డాక్టర్ ప్రియాంక శుక్లా తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని వీసీ హాలులో జిల్లా ఎన్నికల అధికారి గౌతమ్ అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి,డీఆర్ఓ హరిప్రియతో కలసి ఈ ప్రక్రియ ఆమె నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి గౌతమ్ మాట్లాడుతూ మేడ్చల్, మల్కాజిగిరి,కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్, ఉప్పల్,ఎల్బీ నగర్ అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని 2996 పోలింగ్ కేంద్రాలకు గాను ఆన్ లైన్ ద్వారా ఈవీఎం యంత్రాలను కేటాయించామన్నారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ అభిలాష్ అభినవ్,ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ రాజేశ్వర్ రెడ్డి, వివిధ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

మనం ప్రకృతి కేంద్రీకృత అభివృద్ధి వైపు మారాలి

గుజరాత్ అటవీ దళాల అధిపతి యూడీ సింగ్



సురేష్‌కుమార్ దేశాయ్‌కు ప్రశంస పత్రం అందజేస్తున్న యూడీ సింగ్,ఆర్ఎం దోబ్రియాల్



దూలపల్లిలోని రాష్ట్ర అటవీ అకాడమీలో శిక్షణ పూర్తి చేసుకున్న అటవీ క్షేత్ర అధికారులు

సుభాష్‌నగర్: అడవులు జీవానికి ఆధారమైన జలానికి నెలవలని... మానవ కేంద్రీకృత అభివృద్ధి నుంచి ప్రకృతి కేంద్రీకృత అభివృద్ధి వైపు మారాలని గుజరాత్ అటవీ దళాల అధిపతి యూడీ సింగ్ అన్నారు. దూలపల్లిలోని తెలంగాణ అటవీ అకాడమీలో శుక్రవారం 9వ బ్యాచ్ అటవీ క్షేత్రాధికారుల ప్రవేశ శిక్షణ కార్యక్రమ స్నాతకోత్సవం జరిగింది. ముఖ్యఅతిథిగా గుజరాత్ అటవీ దళాల అధిపతి యూడీ సింగ్, తెలంగాణ అటవీ దళాల అధిపతి ఆర్ఎం డోబ్రియాల్ ప్రత్యేక ఆహ్వానితులుగా, ప్రధాన ముఖ్య అటవీ సంరక్షణాధికారి ఎల్యూసింగ్ మేరు, తెలంగాణ రాష్ట్ర అటవీ అకాడమీ సంచాలకులు ఎస్‌జే ఆషా పాల్గొన్నారు. ఈ సందర్భంగా శిక్షణా కార్యక్రమం కోర్సు డైరెక్టర్ వి. ఆంజనేయులు శిక్షణా కార్యక్రమం రిపోర్టును సమర్పించారు. పాసింగ్ ఔట్ పరేడ్ ను తనిఖీ చేసిన అనంతరం జరిగిన స్నాతకోత్సవ సమావేశంలో శిక్షణార్థులకు ముఖ్య అతిథి, ధ్రువపత్రాలు, ఆయా విషయాలలో ప్రతిభను కనబరచిన వారికి పతకాలు, ప్రతిభా పత్రాలను ప్రదానం చేశారు.

శిక్షణ పూర్తి చేసుకున్న 47 మంది అధికారులు..

◆ 18 నెలల పాటు మొత్తం 47 మంది అధికారులు శిక్షణ పూర్తి చేసుకున్నారు. వారిలో 42 మంది గుజరాత్ రాష్ట్రానికి చెందిన వారు కాగా, నలుగురు జమ్ముకాశ్మీర్, ఒకరు లద్దాక్‌కు చెందిన వారు ఉన్నారు. వీరిలో 11 మంది మహిళా అధికారులున్నారు. గుజరాత్ కు చెందిన సురేశ్ కుమార్ దేశాయ్ బ్యాచ్ మొత్తంలో అత్యుత్తమ ప్రతిభను కనబరచి బంగారు (07) పతకాలను సాధించడంతో పాటు శిక్షణా కార్యక్రమంలో అత్యధిక మార్కులతో టాపర్‌గా నిలిచారు. రోనక్ కేవడియా బంగారు (07), వెండి(03) వెండి పతకాలను సాధించారు.

◆ అదే విధంగా పార్థ్‌కుమార్ భీమాని, జనక్ రామ్ కకాడియా, మనీష్ కుమార్ పటేల్ ఒక్కొక్కరూ రెండు చొప్పున పతకాలను, జిగ్నేష్ భాయ్ మేనియా, సుమన్ మీనా, మిలన్ సోలంకి, కథమ్ పటేల్, భార్గవ్ పిపాలియా ఒక్కొక్క బంగారు పతకాన్ని పొందారు.

◆ ఈ సందర్భంగా ముఖ్య అతిథి, యూడీ సింగ్ శిక్షణ అధికారులను ఉద్దేశించి ప్రసంగిస్తూ అడవులు జీవానికి ఆలంబన అనీ, జీవవైవిధ్యం నష్టాన్ని, శీతోష్ణస్థితి మార్పు సమస్యలను ఎదుర్కోవడానికి కీలకమని పేర్కొన్నారు. శిక్షణలో నేర్చుకున్న విషయాలను క్షేత్ర స్థాయిలో అమలు పరచాలని, నైపుణ్యాలను పెంపొందించుకుంటూ పరిస్థితుల నుంచి కొత్త విషయాలను నేర్చుకుంటూ వృత్తిని సమర్థవంతంగా నిర్వహించి అడవులను కాపాడాలన్నారు.

◆ తెలంగాణ అటవీ దళాల అధిపతి ఆర్.ఎం .డోబ్రియాల్ మాట్లాడుతూ శిక్షణ పూర్తి చేసుకున్న అధికారులు వ్యక్తిగతంగా ప్రతి ఒక్కరూ ఏదో ఒకరంగంలో నైపుణ్యాలను సాధించాలన్నారు. సంస్థ కోసం పనిచేయాలని, క్షేత్రస్థాయిలో సమస్యలను సమర్థవంతంగా ఎదుర్కోవాలన్నారు. ప్రధాన ముఖ్య అటవీ సంరక్షణాధికారి, ఎల్యూసింగ్ మేరు, అకాడమీ సంచాలకులు ఎస్‌జే ఆషా ప్రసంగంలో విలువైన సూచనలు చేశారు.

◆ ఈ కార్యక్రమంలో విశ్రాంత అటవీ అధికారులు ప్రదీప్, కిషన్, అటవీ అకాడమీ అదనపు సంచాలకులు ఎస్.రమేశ్, అకాడమీ సంయుక్త సంచాలకులు బి.ప్రవీణ, ఉప సంచాలకులు సీహెచ్ గంగారెడ్డి, వి.రామమోహన్, కె.శ్రీనివాస్, ఎస్‌పి నాగినీ బాను, పీవీ రామకృష్ణ, సహాయ సంచాలకులు ఎం.వంశీకృష్ణ, వై.సుభాష్ చంద్రయాదవ్, ఎం.రామ్ మోహన్, షేక్ బాబా ఖాదర్ వలీ, ఉపక్షేత్రాధికారి ఉమారాణి, జె.పద్మ, సెక్షన్ అధికారి ప్రవీణ్‌కుమార్, ఫిజికల్ ట్రైనర్స్ కొండల్‌రావు, అశోక్‌రెడ్డి, రఫీ ఉల్లా, అనిల్, శిక్షణ అటవీ క్షేత్రాధికారులు, శిక్షణ సెక్షన్ అధికారులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.


400 సీట్లలో బీజేపీ విజయం సాధిస్తుంది

బీజేపీ ఎన్నికల పరిశీలకుడు రాజేంద్ర రాథోడ్

కుత్బుల్లాపూర్: లోక్‌సభ ఎన్నికల్లో 400 సీట్లలో బీజేపీ విజయం సాధిస్తుందని బీజేపీ ఎన్నికల పరిశీలకుడు, రాజస్థాన్ మాజీ మంత్రి రాజేంద్ర రాథోడ్ అన్నారు. మల్కాజిగిరి లోక్‌సభ పార్టీ అభ్యర్థి ఈటల రాజేందర్‌కు మద్దతుగా శుక్రవారం కొంపల్లిలో బీజేపీ నేత శివాజీ రాజు నివాసంలో ముఖ్య నాయకుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి రాజేంద్ర రాథోడ్, దేవ్ నారాయణ్ బోర్డు చైర్మన్ ఓం ప్రకాశ్ భదస్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు.

◆ సమావేశంలో కొంపల్లి మున్సిపాలిటీలో ప్రస్తుత పార్టీ పరిస్థితి, ప్రచార కార్యక్రమాలు, వివిధ విషయాలను నాయకులను అడిగి తెలుసుకున్నారు. మల్కాజ్‌గిరిలో బీజేపీ గెలిచే అవకాశాలే ఎక్కువగా ఉన్నాయన్నారు. నాయకులు, కార్యకర్తలు మరింత శ్రమించాలని సూచించారు. ప్రధాని నరేంద్ర మోదీని మూడోసారి గెలిపించే విధంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు.

◆ ఈ కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ మల్లారెడ్డి, రాష్ట్ర ఓబీసీ ప్రధాన కార్యదర్శి నందనం దివాకర్, జాతీయ కిసాన్ మోర్చా కమిటీ సభ్యుడు చంద్ర శేఖర్, ఉపాధ్యక్షులు రాజిరెడ్డి, బావిగడ్డ రవి, ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి సతీష్ సగర, మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి సరితారావు, అసెంబ్లీ ప్రభరి జగన్, అసెంబ్లీ కన్వీనర్ శంకర్‌రెడ్డి, కొంపల్లి మున్సిపాలిటీ అధ్యక్షులు జనార్దన్‌రెడ్డి, సూర్యకళ, ఉదయ, సంధ్య, మాధురి తదితరులు పాల్గొన్నారు.



రాజేంద్ర రాథోడ్, దేవ్ నారాయణ్ బోర్డు చైర్మన్ ఓం ప్రకాశ్‌ను సన్మానిస్తున్న నాయకులు

పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ పకడ్బందీగా నిర్వహించాలి

మల్కాజిగిరి రిటర్నింగ్ అధికారి గౌతమ్



స్ట్రాంగ్ రూమ్, ఓటర్ ఫెసిలిటేషన్ సెంటర్‌ను పరిశీలిస్తున్న రిటర్నింగ్ అధికారి గౌతమ్

సాక్షి, మేడ్చల్ జిల్లా: పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ పకడ్బందీగా నిర్వహించాలని మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి గౌతమ్ ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం బోగారం హోలీ మేరీ కాలేజీలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్, ఓటర్ ఫెసిలిటేషన్ సెంటర్‌ను ఆయన పరిశీలించారు. మేడ్చల్ అసెంబ్లీ సెగ్మెంట్‌లో పోస్టల్ బ్యాలెట్, పోలింగ్ రిజిస్ట్రేషన్, ఓటరు రిజిస్ట్రేషన్ రిజిస్టర్లు, ఓటింగ్ సరళిని ఆయన పరిశీలించారు. ఈ నెల 8 వరకు నిర్వహించే పోస్టల్ బ్యాలెట్‌ను ఉద్యోగులందరూ వినియోగించుకునేందుకు ఓటరు ఫెసిలిటేషన్ సెంటర్ ను ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో అదనపు జిల్లా కలెక్టర్ విజయేందర్ రెడ్డి, కీసర ఆర్డీవో వెంకట ఉపేందర్ రెడ్డి,అధికారులు రాజేశ్వర్ రెడ్డి రజిని,హసీనా పాల్గొన్నారు.